విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

స్వార్థ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారు

భిక్కనూరు, ఫిబ్రవరి 26: స్వార్థం కోసం పార్టీలు మారే నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు పెంజర్ల సతీశ్‌రెడ్డి అన్నారు. పదవుల కోసం కొందరు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతుండడంపై మండిపడ్డారు. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించిన నాయకులు.. నేడు పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు వెళ్లిపోవడం సిగ్గుచేటని అన్నారు. బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలమని, వారి కృషితోనే రానున్న లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు మోహన్‌రెడ్డి, జగదీశ్, రాజు పాల్గొన్నారు.

ఈ-పాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలి

మాచారెడ్డి, ఫిబ్రవరి 26 : ఎరువులను ఈ-పాస్ ద్వారానే విక్రయించాలని కామారెడ్డి ఏడీఏ అపర్ణ సూచించారు. మండలకేంద్రంలోని సొసైటీతోపాటు ఎరువుల విక్రయ కేంద్రాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఎరువుల స్టాక్, రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట ఏవో రమ్యశ్రీ, ఏఈవోలు ఉన్నారు.

పీజీ పరీక్షా కేంద్రం తనిఖీ

భిక్కనూరు, ఫిబ్రవరి 26 : తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సెంటర్‌ను పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ అరుణ సోమవారం తనిఖీ చేశారు. 166 మంది విద్యార్థులకు గాను 9 మంది గైర్హాజరయ్యారు.

హెచ్ఐవీ నిర్ధారణ శిబిరం

రాజంపేట్, ఫిబ్రవరి 26: మండలంలోని కొండాపూర్ క్లస్టర్‌లో సోమవారం విశ్వజ్యోతి గ్రామసంఘంలో వైఆర్‌జీ కేర్ సహకారంతో హెచ్ఐవీ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా 23 మంది స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు బ్లడ్‌టెస్ట్ చేశారు. కార్యక్రమంలో డీఆర్పీ సుధాకర్, సాయిలు, కిరణ్, సీసీ భాగయ్య, వీవోఏ భాగ్యలక్ష్మి, కవిత, సంధ్యారాణి పాల్గొన్నారు.

మిర్జాపూర్‌లో మెగా హెల్త్‌క్యాంప్..

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 26: మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎంఎంయూ ఆధ్వర్యంలో సోమవారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 127 మందికి బీపీ,షుగర్‌తోపాటు గుండె పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు నరేందర్, భవ్య, రెడ్‌క్రాస్ జిల్లా ఈసీ మెంబర్ మారుతి, మండల చైర్మన్ నారాయణ, మాజీ సర్పంచ్ పురం లక్ష్మి, నాయకులు వెంకటి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి

మాట్లాడుతున్న పంచాయతీ సిబ్బంది

దోమకొండ, ఫిబ్రవరి 26 : తమకు ఐదు నెలలుగా జీతాలు రావడం లేదని మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. జీపీ ఆవరణలో వారు సోమవారం మాట్లాడారు. వేతనాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందని, వెంటనే జీతాలు ఇవ్వాలని కోరారు. సంతోష్, నర్సింహులు, శివరాజ్, శంకర్, వెంకటి, బాల్‌రాజ్, యాదగిరి, భాస్కర్, గంగాధర్, విజయ పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలి

గాంధారి, ఫిబ్రవరి 26: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి, గుర్జాల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను ఆయన సోమవారం పరిశీలించారు. నర్సరీల్లోని మొక్కలకు ప్రతిరోజూ నీరు పట్టాలని, మొక్కల మధ్యలో కలుపు మొక్కలను తొలగించాలని నిర్వాహకులకు సూచించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

గాంధారి, ఫిబ్రవరి 26: మండలం కేంద్రంతోపాటు పొతంగల్ కలాన్‌లో ఉన్న ఎరువులు, పురుగుమందుల విక్రయ దుకాణాలను మండల వ్యవసాయాధికారి నరేశ్ సోమవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని దుకాణా దారులకు హెచ్చరించారు. స్టాక్ రికార్డులను మెంటెన్ చేయాలని, ఎరువులు, పురుగుమందు కొన్న రైతులకు బిల్లులను తప్పకుండా ఇవ్వాలన్నారు.

వీరభద్రేశ్వర స్వామికి అన్నపూజ

అన్నపూజలో పాల్గొన్న భక్తులు

మద్నూర్, ఫిబ్రవరి 26: మండలంలోని కోడిచిర గ్రామ శివారులో ఉన్న వీరభద్రేశ్వర స్వామికి భక్తులు సోమవారం ప్రత్యేక పూజ చేశారు. స్వామిని అన్నంతో అలంకరించారు. అన్నపూజ చేస్తే తమ కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు.

'ప్రజావాణి'కి 50 ఫిర్యాదులు

కామారెడ్డి, ఫిబ్రవరి 26 : పట్టణంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుంచి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, జిల్లా అధికారులు ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి జాప్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 50 ఫిర్యాదులు అందాయని తెలిపారు. భూ సమస్యలపై ధరణికి సంబంధించి 26 అర్జీలు, పంచాయతీ శాఖకు 9, సర్వే ల్యాండ్ రికార్డ్స్ 4, మున్సిపల్ 3, ఎస్సీ, హౌసింగ్, డీఆర్డీవోకు 2 చొప్పున, విద్యుత్, వైద్యశాఖలకు ఒక్కో ఫిర్యాదు వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఏర్పాట్లపై కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఫిబ్రవరి 26 : మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్న పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సూచించారు. పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని, జిల్లా వ్యాప్తంగా 11,962 మంది (బాలురు-5834, బాలికలు-6128) విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఇందుకోసం మొత్తం 62 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్ జరుగకుండా సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. చిన్న పొరపాటుకు సైతం తావివ్వకుండా అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఏవైనా ఘటనలు వైరల్ అయితే విద్యార్థులకు నష్టం కలిగే అవకాశముందని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేసి సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. సమావేశంలో డీఈవో రాజు, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ నీలం లింగం, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌బీఐ అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

చదువుకున్న వారు కూడా ఆన్‌లైన్ మోసాలబారిన పడుతున్నారని, ప్రతి ఒక్కరూ సైబర్ మోసాలు, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ పాటిల్ సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ముద్రించిన గోడ ప్రతులను లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ భార్గవ్ సుధీర్, డీఈవో రాజుతో కలిసి ఆవిష్కరించారు. కొందరు సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో మోసపోతున్నారని కలెక్టర్ తెలిపారు. సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బదిలీపై బాన్సువాడకు వచ్చి బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ సత్యనారాయణ సోమవారం మాజీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీకి పోచారం అభినందనలు తెలిపారు.
-బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 26

సేవాలాల్ జయంతి వేడుకలకు తరలిరావాలి

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 26 : బాన్సువాడ పట్టణంలోని బంజారా భవన్‌లో మంగళవారం అధికారికంగా నిర్వహించనున్న సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలకు గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆలిండియా బంజారా సేవా సంఘం మండల ప్రధాన కార్యదర్శి రూప్‌సింగ్ కోరారు. మండలంలోని మొగులాన్‌పల్లి తండా శివారులో పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలతో సోమవారం మాట్లాడారు. ఆయన వెంట సంఘ సభ్యులు పీర్యానాయక్, దూప్‌సింగ్, ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రాజంపేట్, ఫిబ్రవరి 26: మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో రూ. 10 లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాణాల సుమలత, నాయకులు ఎర్ర ప్రణీత్‌రెడ్డి, సంజీవరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఆహార పదార్థాలు మిగిలిపోతే మాకివ్వండి'

కామారెడ్డి, ఫిబ్రవరి 26 : పట్టణ పరిధిలో నిర్వహించే శుభకార్యాల్లో ఆహార పదార్థాలు మిగిలిపోతే బాంబే క్లాత్ హౌస్‌లో అందజేయాలని నిర్వాహకులు కోరారు. తాము వెంటనే పేదలకు పంపిణీ చేస్తామని తెలిపారు. వివరాలకు 9441922678, 9963530055 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంజిరెడ్డి

విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలి

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 26: సైన్స్‌ఫెయిర్ల నిర్వహణతో విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత బయటపడుతుందని బాన్సువాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అంజిరెడ్డి అన్నారు. పిల్లల్లోని ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మెగా సైన్స్ ఫెయిర్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపయోగపడే పరికరాలను పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. అంతకుముందు విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు. కార్యక్రమంలో అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధి సంగమేశ్వర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

బాన్సువాడ టౌన్/దోమకొండ/నిజాంసాగర్, ఫిబ్రవరి 26 : వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ట్రేస్ చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని గుర్తించి బాధితులకు సోమవారం అందజేశారు. బాన్సువాడ పట్టణ పరిధిలో పోగొట్టుకున్న 4 ఫోన్లను బాధితులకు డీఎస్పీ సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడ పరిధిలో ఇప్పటివరకు 250 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉన్నట్లు చెప్పారు. అందులో 2 ఫోన్లను దుబాయి, నేపాల్ నుంచి, 11 మొబైళ్లను ఇతర రాష్ట్రాల నుంచి రికవరీ చేశామని చెప్పారు. ఎస్‌హెచ్‌వో కృష్ణ, సిబ్బంది రాజేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. దోమకొండకు చెందిన చిన్నగారి నర్సయ్య మొబైల్ ఫోన్‌ను ఎస్సై గణేశ్, జుక్కల్ మండలంలోని పెద్దఏడ్గి గ్రామానికి చెందిన గంగాధర్ సెల్‌ఫోన్‌ను ఎస్సై సత్యనారాయణ స్థానిక పోలీస్ స్టేషన్లలో అందజేశారు.

బాధితులకు మొబైల్ ఫోన్లను అందజేస్తున్న బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలి

ఎల్లారెడ్డి తహసీల్దార్ మహేందర్

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మహేందర్

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 26: ఎల్లారెడ్డి నియోజక వర్గ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను విధిగా పరిశీలించాలని, అక్కడి సమస్యలను తెలుసుకోవాలని ఎల్లారెడ్డి తహసీల్దార్ మహేందర్ అన్నారు. ఎల్లారెడ్డిలోని ఆదర్శ డిగ్రీ కాలేజీలో సోమవారం ఏర్పాటు చేసిన సెక్టోరియల్ అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా నియోజక వర్గంలోని అన్ని సెక్టోరియళ్ల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగు నీటి సమస్యలు ఉంటే గుర్తించాలన్నారు. సమావేశంలో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసు, సీఐ రవీందర్ నాయక్, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

క్యాలెండర్లను విడుదల చేస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

క్యాలెండర్ల ఆవిష్కరణ



కామారెడ్డి, ఫిబ్రవరి 26 : ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో టీఎన్జీవోస్ క్యాలెండర్‌ను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, సంఘ సభ్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సాయిలు, టీజీవో జిల్లా అధ్యక్షుడు దేవేందర్, కార్యదర్శి సాయిరెడ్డి, ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ అలుక కిషన్, సమన్వయకర్త శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

చేనేత ఐక్యవేదిక క్యాలెండర్..

రాష్ట్ర చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, కలెక్టర్ జితేశ్ పాటిల్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బని కృష్ణహరి, జిల్లా అధ్యక్షుడు ఇట్టం సిద్దిరాములు, పట్టణ అధ్యక్షుడు చాట్ల రాజేశ్వర్, సలహాదారుడు సబ్బని ధర్మపురి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పండ్ల రాజు, సామల రవి, ఐరేని సందీప్, చాట్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పులు.. ఆందోళనలో అన్నదాతలు

డోంగ్లీ శివారులో రైతులు సాగుచేస్తున్న జొన్న పంట

డోంగ్లీ, ఫిబ్రవరి 26: రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఎండలు ముదురుతున్న తరుణంలోనే వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కూడా కురిశాయి. కాగా ఇప్పటికే చేతికి వచ్చిన మినుము, జొన్న పంటల విషయంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలవ్యాప్తంగా 800 ఎకరాల్లో మినుము, 600 ఎకరాల్లో జొన్న పంటను సాగుచేశారు. ఈదురు గాలులు వీస్తే జొన్న నేలకొరగడంతోపాటు వర్షం కురిస్తే జొన్నలు నల్లబడుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 26: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ.పది లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సహకారంతో అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చిప్పె మోహన్, సంజీవ్, పండరి, బాల్‌రాజ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మోహన్‌రెడ్డి

బిచ్కుంద, ఫిబ్రవరి 26: మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్సై మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాదక ద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా డ్రగ్స్, గంజాయి అమ్మినా, సేవించినా తమకు సమాచారం ఇచ్చాలని సూచించారు.

బోరు లారీ ఢీకొని ఒకరి దుర్మరణం

నిజాంసాగర్, ఫిబ్రవరి 26: జుక్కల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో సోమవారం బోరు లారీ ఢీకొని గైక్వాడ్ మారుతి(48) మృతిచెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మృతుడికి ఐదుగురు పిల్లలు ఉన్నారన్నారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించామన్నారు.

నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 26: నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో గల్లంతైన విద్యార్థి మహేశ్(14) మృతదేహం సోమవారం లభించింది. ఎల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న లైన్ మహేశ్ శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిజాంసాగర్ బ్యాక్‌వాటర్ పడి గల్లంతయ్యాడు. అతడి కోసం గ్రామస్తులు ఆదివారం గజ ఈతగాళ్ల సాయంతో గాలించినా ఆచూకీ లభించలేదు. కాగా సోమవారం ఉదయం మహేశ్ మృతదేహం నీటిపై తేలడంతో బయటికి తీశారు. ఎల్లారెడ్డి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. పాఠశాలలో మంచి విద్యార్థిగా పేరున్న మహేశ్ మృతితో గ్రామంలో విషాదం నెలకొన్నది.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

బిచ్కుంద, ఫిబ్రవరి 26: మండలంలోని ఖత్‌గావ్ గ్రామ మంజీరా నది శివారు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్పెషల్ పార్టీ అధికారినంటూ బెదిరింపులు : వివరాలు ఆరా తీయడంతో పరారీ

నిజాంసాగర్, ఫిబ్రవరి 26: మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ఓ బెల్టు దుకాణం వద్దకు సోమవారం సాయంత్రం ఓ వ్యక్తి వచ్చాడు. తాను స్పెషల్ పార్టీ అధికారిని అని పరిచయం చేసుకున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు దుకణాన్ని నిర్వహిస్తున్నావని బెదిరించాడు. డబ్బులు ఇవ్వాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించాడు. అనుమానంతో బెల్టు షాపు నిర్వాహకుడు ఆరా తీయగా.. అతడు అధికారి కాదని, ఆధార్ కార్డు తీసుకొని చూడగా పేరు పండరిగౌడ్ తెలిసింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో సదరు వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319443-All

CHANGE OF NAME

★I'm SAMA RAMYA, W/o. Shyamanth Reddy, R/o. 1-124, Donkeshwar, Nandipet, Nizamabad District, TS., have Changed My Name as KALLEM RAMYA REDDY, W/o. Kallem Shyamanth Reddy.
NT-311958

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.